క్లుప్తంగా

సీఐగా రవిరాజు నియామకం



ఆత్మకూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సీఐగా డి.రవిరాజును నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సీఐగా పని చేసిన కుమార్ వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన క్రమంలో శనివారం రిలీవ్ అయ్యారు.

ఎస్సైగా దేవేందర్ బాధ్యతల స్వీకరణ



శాయంపేట : ఎస్సైగా డి.దేవేందర్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన ఇమ్మడి వీరభద్రరావు పర్వతగిరి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో దేవేందర్ బాధ్యతలు చేపట్టారు. దేవేందర్ ఎస్సైగా కరీంనగర్ జిల్లా జూలపల్లి, వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ఖాజీపేట, లింగాల ఘణపురం, పర్వతగిరి పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించారు. ఆయనకు పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సన్మానం

బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎస్సై దేవేందర్‌ను ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు కందగట్ల రవి, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూలమొక్క, బొకె అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాంశెట్టి లక్ష్మారెడ్డి, మారెపల్లి మోహన్, కార్తీక్, కరణ్‌బాబు, పాపయ్య, గణేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, కరుణాకర్, రాజేందర్, ప్రవీణ్, మహేష్, రాజు పాల్గొన్నారు.

సత్కారం



ఐనవోలు : ఎస్సైగా విధుల్లో చేరిన సందర్భంగా వంగాల నవీన్‌కుమార్‌ను ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్(మెపా), ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, బీజేపీ, బీఆర్ఎస్ మండల నాయకులు శనివారం సత్కరించారు. తొలుత వారు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు చొరవ చూపాలని కోరారు. ఎస్సైని కలిసిన వారిలో మెపా నాయకులు అశోక్, రాజేష్, శ్రీను, చందు, బీజేపీ జిల్లా నాయకులు గుండెకారి కోటేశ్వర్, బొల్లపెల్లి మహేష్, రవీందర్ రెడ్డి, కుమారస్వామి, బీఆర్ఎస్ నాయకులు సురేష్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు బొక్కల నారాయణ, బరిగెల వెంకటస్వామి, కట్కూరి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

'మణిపూర్' ఘటనను సమాజం ఖండించాలి

కమలాపూర్ : మణిపూర్ ఘటనను సమాజంలోని అన్ని వర్గాల ప్రజలూ ముక్తకంఠంతో ఖండించాలని ప్రముఖ సామాజిక కార్యకర్త గుత్తికొండ చక్రధార్ ఆకాంక్షించారు. ఆ ఘటనకు బాధ్యులైన దుండగులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుని బాధితులకు స్వాంతన కల్పించాలని ఆయన ఆకాంక్షించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. దేశంలో నానాటికీ మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. సభ్యసమాజం తల దించుకునేలా మహిళలను నగ్నంగా ఊరేగించడం దుర్మార్గమన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోనూ మహిళలపై దారుణాలు కొనసాగుతుండడం బాధాకరమన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించి భవిష్యత్‌లో అలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. మణిపూర్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ, మణిపూర్ సీఎం బీరేంద్రసింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్యక్రమంలో నాయకులు రాంపురం రమేష్, అల్లంకొండ శంకర్, పెర్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

దామెర : పండ్ల తోటల సాగుకు ఆసక్తి, అర్హత కలిగిన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) కింద పండ్ల తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. అర్హులకు ప్రభుత్వ సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన రైతులు పంచాయతీ కార్యదర్శులను, ఈజీఎస్ అధికారులను, ఎంపీడీఓను సంప్రదించాలని కోరారు.

ఉరితాళ్లతో జీపీ కార్మికుల నిరసన



కమలాపూర్ : ఉరితాళ్లతో కార్మికుల నిరసన



ఐనవోలు : తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాస్తారోకో చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని శిబిరం వద్ద గ్రామ పంచాయతీ కార్మికులు శనివారం మెడకు ఉరితాళ్లు వేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఇసంపెల్లి అయిలయ్య మాట్లాడారు. 17 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందని స్పష్టం చేశారు. సమ్మెకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు నరిగె ఓదెలు శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి రాజయ్య, సలహాదారు స్వామి, జిల్లా నాయకులు మాట్ల భాస్కర్, అరుణ, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో

ఐనవోలు : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బొక్క రాజుగౌడ్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బెట యాకయ్య, మండల అధ్యక్షుడు కొత్తూరి ఏశోబు, కొండేటి రవి, మాదాసి సంజీవ, బొక్కల సురేందర్, రంజిత, ఎలిశమ్మ పాల్గొన్నారు.



ఆత్మకూరు : నిరసన తెలుపుతున్న కార్మికులు

చెవిలో పువ్వులతో నిరసన

ఆత్మకూరు : మండల కేంద్రంలో జీపీ కార్మికులు చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. సమ్మెకు టీజీకేఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి మల్లారెడ్డి ఆధ్వర్యంలోని బృందం సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడారు. జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి రాంబాబు, కోశాధికారి నరేష్, నాయకులు పొగాకుల రాజు, పూలమ్మ, రమ, శ్రీను, రాజేశ్వర్, సాంబయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.



పరకాలలో..

పరకాల : పట్టణంలోని పంచాయతీ కార్మికుల సమ్మెకు ఎస్ఎఫ్ఐ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఉద్యోగులను, సిబ్బందిని నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, నాయకులు మంద రోషన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

'దాశరథి' రచనలు స్ఫూర్తిదాయకం



పరకాల: నివాళులర్పిస్తున్న రాందాస్, తదితరులు

పరకాల : ప్రముఖ కవి దాశరథి కృష్ణమాచార్యులు సాగించిన రచనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని కళాభారతి నాటక సంస్థ అధ్యక్షుడు ఏరుకొండ రాందాస్ తెలిపారు. పట్టణంలోని అమరధామంలో సాహితి మిత్ర మండలి ఆధ్వర్యంలో శనివారం దాశరథి కృష్ణమాచార్యులు జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత కృష్ణమాచార్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాందాస్ మాట్లాడారు. కృష్ణమాచార్యులు తన రచనలతో నిజాం నిరంకుశత్వంపై పోరాడారని గుర్తు చేశారు. ఆయన్ను గొప్ప కవిగా కీర్తించారు. తెలంగాణలో నిజాం పాలనకు వ్యతిరేకంగా గడ్డిపోచ సైతం కత్తిపట్టి యుద్ధం చేస్తుండగా అగ్నిధార, రుద్రవీణ వంటి అనేక రచనలు చేశారని తెలిపారు. 'ఆ చల్లని సముద్ర గర్భం..' వంటి అద్భుత గేయాలతో సమాజాన్ని చైతన్యవంతం చేశారని చెప్పారు. కార్యక్రమంలో సాహితీ మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి అడప రాజు, కార్యదర్శి వజ్జీరు ప్రదీప్, కవులు బండారి రాజ్‌కుమార్, క్రాంతి, లెనిన్, తాటి హరీష్, రసూద్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



హన్మకొండ: నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ బాషా, ఇన్‌చార్జ్ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు

నవయుగ వైతాళికుడు..

హన్మకొండ: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన సాహితీకారుడు, నవయుగ వైతాళికుడు, మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు అని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ బాషా కొనియాడారు. హనుమకొండలోని శ్రీచైతన్య స్కూల్‌లో దాశరథి కృష్ణమాచార్యులు జయంతిని జరుపుకున్నారు. ముందుగా దాశరథి చిత్రపటానికి ప్రిన్సిపాల్ షేక్ బాషా, ఇన్‌చార్జ్ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాశరథి కృష్ణమాచార్యులు ఒకవైపు సృజనాత్మకత సాహిత్య రచన, మరోవైపు ప్రజా ఉద్యమాల్లో పాల్గొని తన కవితా గర్జనతో ప్రజలను చైతన్యవంతులను చేసిన మహాకవి అని అభివర్ణించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాకీ, జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ మహేష్, ఉపాధ్యాయులు రఘు, అజయ్, సతీష్, సుభాష్ చంద్రబోస్, కిరణ్, కిషన్‌రెడ్డి, విక్రమ్, శ్రీనివాసచారి, గీతారాణి, శిరీష, నరేందర్ పాల్గొన్నారు.

చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రవి

శాయంపేట : చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని స్థానిక సర్పంచ్ కందగట్ల రవి తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హరితహారంలో భాగంగా మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని ప్రజలకు శనివారం ఆయన మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. గ్రామంలోని నర్సరీలో 10 వేల మొక్కలను పెంచామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో హరితహారంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి 6 చొప్పున మొక్కలు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడేలా తైవాన్, జామ, ఉసిరి, అల్లనేరేడు, నిమ్మ, గులాబీ, మందార, తదితర మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మొక్కలను నాటడంతోపాటు వాటిని సంరక్షించడాన్ని బాధ్యతగా భావించాలని కోరారు. ప్రభుత్వం మొక్కల పంపిణీకి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ రేణికుంట్ల సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నడికూడ : 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పరకాల ఆర్డీఓ కె.శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదుపై బూత్ స్థాయి అధికారులకు (బీఎల్వో)లకు శనివారం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతికి ఆయన పాల్గొని మాట్లాడారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఫామ్–6ను నింపి బీఎల్వోలకు అందించాలని సూచించారు. ఆన్‌లైన్లోనూ ఓటు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఓటు నమోదు యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. బీఎల్వోలు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఓటరు జాబితా తయారీలో లోపాలుండకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ హేమనాయక్, ఏఎస్ఓ నాగేశ్వర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

విశ్వరూప సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అంబాల చంద్రమౌళి

ఎల్కతుర్తి : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో అక్టోబర్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి కోరారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 29 ఏళ్లుగా ఎస్సీ ఏబీసీడీ కోసం పోరాటం సాగుతోందని చెప్పారు. వర్గీకరణ అంశం చివరి దశకు చేరిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత పార్లమెంటరీ సమావేశాల్లోనే వర్గీకరణకు బిల్లు పెట్టి ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు జన్ను దినేష్, గంగారం శ్రీనివాస్, శనిగరం రవీందర్, మేకల రవీందర్, అంబాల సంపత్, కడారి రాజారామ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై విమర్శలు సరికాదు

ఆత్మకూరు : టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఉచితంగా 24 గంటల కరెంటు ఇస్తున్నట్లు ఊదరగొడుతున్నా వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్కులను పరిశీలిస్తే వ్యవసాయానికి ఎన్ని గంటలు సరఫరా చేస్తున్నది తెలుస్తుందని తెలిపారు. రైతులకు రైతుబంధు సైతం సరిగా అమలు కావడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని ఎమ్మెల్యేకు హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు.

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి

● జెడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్



మాట్లాడుతున్న చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్

ఎల్కతుర్తి : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే మండలం అభివృద్ధి చెందుతుందని హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేకల స్వప్న అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి చైర్మన్ సుధీర్‌కుమార్ ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన నివేదికను ప్రవేశపెట్టారు. స్థానిక మార్కెట్ యార్డు నుంచి కేజీబీవీ వరకు సీసీ రోడ్డు వేయాలని ప్రిన్సిపాల్ అనితాదేవి ప్రజాప్రతినిధులను, అధికారులను కోరారు. రైతులకు పండ్ల పెంపకంపై ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్న క్రమంలో ఆసక్తి కలిగిన రైతులు వినియోగించుకోవాలని ఉద్యాన శాఖ అధికారిణి మానస కోరారు. పట్టుపరిశ్రమ శాఖ అధికారి సారంగపాణి మాట్లాడుతూ రైతులు చీడపీడల బెడద లేని మల్బరీ సాగు చేపట్టాలని సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయలోకి వర్షపునీరు చేరుతుండడంతో విద్యార్థినులను సురక్షితంగా ఉన్న మరో పాఠశాలకు తరలించినట్టు ఎంపీపీ మేకల స్వప్న తెలిపారు. గత సమావేశాలకు ఎందుకు హాజరు కాలేదని ఎస్సీ బాయ్స్ హాస్టల్ వార్డెన్‌ను ఆమె ప్రశ్నించారు. గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలపై రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆర్ఐకి చెప్పారు. వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కోరారు. విశాల సహకార సంఘంలో రైతులకు రూ.5 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ తెలిపారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని దామెర ఎంపీటీసీ గొర్రె ఆదాము కోరారు. అనంతరం జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ మాట్లాడారు. అధికారులు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా పాటుపడాలని ప్రజాప్రతినిధులను కోరారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగించాలని వైస్ ఎంపీపీ తంగెడ నగేష్ తీర్మానం ప్రవేశపెట్టగా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు బలపర్చడంతో సభ్యులంతా ఆమోదించారు. సమావేశంలో ఎంపీడీవో తూర్పాటి సునీత, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడి.. ఆస్పత్రి దుస్థితి



ఆరోగ్య ఉపకేంద్రం ముందు నిలిచిన నీరు

శాయంపేట : మండలంలోని కొప్పులలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి ముందు చినుకుపడితే చిత్తడే అంటూ ప్రజలు వాపోతున్నారు. 15 ఏళ్లుగా పరిస్థితి అలాగే ఉన్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా కురుస్తున్న వర్షాలతో ఆస్పత్రి ముందు జలమయమైంది. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్న విషయం తెలిసిందే. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఆరోగ్య ఉపకేంద్రానికి వర్షపు నీటిలోంచి నడిచి వెళ్లాలంటే కొత్త వ్యాధుల బారిన పడతామేమోనంటూ బెంబేలెత్తుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు వైద్యం కోసం ఆరోగ్య కేంద్రానికి వస్తే కాలుజారి ప్రమాదాల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గ్రామసభల్లో పలుసార్లు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్న అపవాదు ఉంది. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆస్పత్రి ముందు మొరం లేదా దుబ్బ పోసి నీరు నిల్వకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు



కమలాపూర్ : పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కమలాపూర్ : రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కమలాపూర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే పీఏసీఎస్ డైరెక్టర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, పింగిళి ప్రదీప్‌రెడ్డి విజయవాడలోని కనకదుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినోద్‌కుమార్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పెండ్యాల రవీందర్‌రెడ్డి, కేడీసీసీబీ జిల్లా డైరెక్టర్ పోరండ్ల కృష్ణప్రసాద్, మాజీ ప్రజాప్రతినిధులు మారపెల్లి నవీన్ కుమార్, లాండిగె లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని బస్టాండ్ సెంటర్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ హాజరై కేక్ కట్ చేసి మాట్లాడారు. వినోద్‌కుమార్ రాజకీయాల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీలు మేకల స్వప్న, జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవీందర్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గొడిశాల సమ్మయ్యగౌడ్, మారుపాటి మహేందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, సర్పంచ్ కొమ్మిడి నిరంజన్ రెడ్డి, ఎంపీటీసీ కడారి రాజు, రైల్వే వేజ్ బోర్డు మెంబర్ ఎల్తూరి స్వామి, నాయకులు గొల్లె మహేందర్, తంగెడ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

శాయంపేట : మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేష్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో, మిల్లులకు తరలింపులో, బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేయడంలోనూ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించారని చెప్పారు. ధాన్యం కొనుగోలు సమయంలో నిర్వాహకులు పలు రకాలుగా మోసాలకు పాల్పడ్డారని తెలిపారు. పలువురు రైతుల ఖాతాల్లో డబ్బులు తక్కువగా జమయ్యాయని, నిర్వాహకులను ప్రశ్నిస్తే మిల్లర్లు తరుగు తీశారంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. సమస్యను రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు వికాస్, దేవేందర్, నరేష్, మనోజ్, సాయితిలక్ పాల్గొన్నారు.

లక్ష్యం వైపు అడుగులు వేయాలి



పూలమాల వేస్తున్న చైర్మన్ బి.నరేందర్‌రెడ్డి

హసన్‌పర్తి: విద్యార్థులు లక్ష్యం వైపు అడుగులు వేయాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బి.నరేందర్‌రెడ్డి చెప్పారు. నగరంలోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో 'ఆల్ఫోర్స్ డాజిల్ –2023' పేరుతో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని తెలిపారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.